క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



రూ.లక్ష చెక్కు అందజేస్తున్న దాతలు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, భక్తుల పాలిట కల్పవల్లిగా పేరొందిన శ్రీపైడితల్లి దేవస్థానంలో జరిగే నిత్యాన్నదానానికి దాసన్నపేటకు చెందిన భక్తురాలు దూసి సీతారామ..లక్ష రూపాయలను విరాళంగా ఆలయ అధికారులకు గురువారం అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని, అమ్మవారి ఆశీస్సులు వారికి ఎల్లప్పుడూ ఉండాలని ఆలయ సూపరింటెండెంట్ రమణి ఆకాంక్షించారు.

టోల్‌ఫ్రీ నంబర్లు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సాయివిజయలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: బాలికలు, విద్యార్థినులు, మహిళల భద్రత కోసం అందుబాటులోని టోల్‌ఫ్రీ నంబర్ల సేవలు సద్వినియోగం చేసుకోవాలని వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.సాయివిజయలక్ష్మి కోరారు. స్థానిక కేంద్రీయ విద్యాలయంలోని విద్యార్థులకు టోల్‌ఫ్రీ నంబర్ల సేవలపై గురువారం అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్నా, వేధింపులకు గురైనా టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 181, 100, 112కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే తక్షణమే భద్రత సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కె.రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనిత తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకురాలు లక్ష్మి

దత్తిరాజేరు: ప్రజలకు పెనుభారంగా మారనున్న స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి అన్నారు. ఈ మేరకు ప్రజావేదిక ఆధ్వర్యంలో కోమటిపల్లి వద్ద గురువారం పలువురు కార్మికులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు స్మార్ట్‌మీటర్లను బద్దలు గొట్టాలని పిలుపునిచ్చిన లోకేశ్ ఇప్పుడు స్మార్ట్‌మీటర్లు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. స్మార్ట్‌మీటర్లను రద్దు చేసే వరకు పోరాటం తప్పదన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాదకద్రవ్యాల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ ఆశియ్య

చీపురుపల్లి రూరల్ (గరివిడి): మాదకద్రవ్యాలకు అలవాటు పడితే కుటుంబాలు, జీవితాలు నాశనమవుతాయని ఆర్డీఓ ఆశియ్య, డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. గరివిడి ఎస్‌డీఎస్ కళాశాలలో 'మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు'పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసలై ఎంతో మంది తమ విలువైన జీవితాలను కోల్పోయారన్నారు. విద్యార్థులు, యువత మంచి నడవడికను అలవరుచుకోవాలని సూచించారు. లక్ష్య సాధన కోసం కష్టపడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, సీఐ ఎస్.శంకరరావు, ఎస్సై బి.లోకేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నానో యూరియా, డీఏపీని వినియోగించాలి

- వ్యవసాయశాఖ ఏడీఏ నాగభూషణం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగభూషణం

గంట్యాడ: నానో యూరియా, నానో డీఏపీ వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని వ్యవసాయశాఖ ఏడీఏ నాగభూషణం తెలిపారు. మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా బెట్ట పరిస్థితుల్లో ఉన్న వరి నారుమడికి 19 - 19 - 19 ఐదు గ్రాములు, అగ్రోమిన్ 3 గ్రాములు చొప్పున లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు కె.గోవిందమ్మ, పి.నిర్మల, మండల వ్యవసాయాధికారి బి.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబుకు అలవాటు

- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్ సీపీ నాయకులు



విజయనగరం ఆరో డివిజన్‌లో కూటమి మోసాలపై వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం

విజయనగరం: ప్రతిసారి ఎన్నికలకు ముందు ప్రజలకు హామీలివ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబు అలవాటు అయిపోయిందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకటరాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, నగర అధ్యక్షుడు ఆశపు వేణులు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నగర పరిధిలోని 1, 3, 6వ డివిజన్లలో గురువారం పర్యటించిన వారికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. ఆ తర్వాత జరిగిన సమావేశాల్లో పాల్గొని, అప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు, ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను తెలిపారు. అప్పట్లో అధికారం చేపట్టిన ఏడాదికే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నింటినీ అమలు చేశారని గుర్తు చేశారు. ప్రతి వర్గానికి మేలు జరిగేలా కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా పథకాలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలోని చంద్రబాబు ప్రభుత్వం మాత్రం గద్దెనెక్కి ఏడాది కాలం దాటినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు.

వైఎస్సార్ సీపీ పోరాడితేనే పథకాలు..

ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ వైఎస్సార్ సీపీ చేసిన పోరాటం కారణంగానే తల్లికి వందనం, గ్యాస్ పథకాలు కొంతమందికి అయినా అందేలా అరకొరగా అమలు చేశారన్నారు. మొత్తం 143 హామీలిచ్చారని, అందులో ప్రధానమైనవి సూపర్ సిక్స్ పథకాలు అని అవి కూడా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఎప్పుడు అధికారంలోకి వచ్చినా చంద్రబాబు ఇలానే చేస్తున్నారని అందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లు నిండిన బీసీలకు పింఛన్ వంటివి ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా నిర్వహించిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని, ఆయనతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తప్పకుండా విజయం సాధిస్తుందని, ఈ కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలనకు ప్రజలు చరమగీతం పాడడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆల్తి సత్యకుమారి, బండారు ఆనంద్, పార్టీ జిల్లా కార్యదర్శి బొద్దాన అప్పారావు, నాయకులు బి.ఈశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



పండా దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన ఆర్ఎస్ఐ ఏఆర్ పండాను గురువారం సత్కరించారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆయనకు దుశ్శాలువా, ప్రశంసాపత్రం అందజేసి, సన్మానించారు. అనంతరం విధి నిర్వహణలో ఆయన సేవలను వక్తలు ప్రశంసించారు. ఉద్యోగ విరమణ అనంతరం కాలం నిండు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.



డెంకాడ: సన్మాన గ్రహీతతో ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్ తదితరులు

కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఉద్యోగ విరమణ పొందిన ఆర్ఐ కేకేఎం రాజును గురువారం సత్కరించారు. ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్ ఈ కార్యక్రమానికి హాజరై, రాజు దంపతులను సన్మానించి, ఆయన సేవలను ప్రశంసించారు.

విద్యార్థులకు అభినందనలు

నెల్లిమర్ల రూరల్: విజయనగరం జోనల్ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్థానిక సరస్వతి శిశుమందిర్ విద్యార్థులను అదే పాఠశాలలో సిబ్బంది గురువారం అభినందించారు. జూలై 25న విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఖేల్ ఖుద్ మామిడిపల్లిలో జరిగిన క్రీడాపోటీల్లో పతివాడ పైడినాయుడు 600 మీటర్ల పరుగుపందెం, హైజంప్‌లలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా మీసాలు లావణ్య..400 మీటర్ల పరుగుపందెం సహా హై, లాంగ్ జంప్‌లలో వరుసగా ప్రథమ, ద్వితీయ, ప్రథమ స్థానాలు సాధించగా వారిని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు అభినందించి, ప్రోత్సహించారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా రేపు

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయ పెండింగ్ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వద్ద ఈ నెల 2వ తేదీన ధర్నా నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో జిల్లా కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా చైర్మన్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో ధర్నా సన్నాహక సమావేశంలో గురువారం జరిగింది. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వల్ల ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులపై చర్చించారు. పొజిషన్ ఐడీలు, ఇతర సాంకేతిక కారణాలు చూపుతూ జీతాలు నిలిపివేయడం సమంజసం కాదన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకూ జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. మొత్తం 18 డిమాండ్ల సాధనకు ప్రభుత్వానికి నోటీస్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. తమ డిమాండ్లు పరిష్కారం కాకుంటే ఈ నెల 12వ తేదీన రాష్ట్ర స్థాయిలో భారీ ధర్నా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు జేవీవీకే ఈశ్వరరావు, కె.జోగారావు, సీహెచ్ సూరిబాబు, ఎస్.పైడిరాజు, వి.రమణ, ఎం.నాగేష్, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి



అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ రవీంద్ర

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ బి.రవీంద్ర సూచించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం పర్యటించినానంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై అభివృద్ధి పనులపై సమీక్షించారు.

రెవెన్యూ వసూళ్లలో లక్ష్యాలను అధిగమించాలని, అందరి సమన్వయంతోనే అన్ని రంగాల అభివృద్ధి అని ఆయన అన్నారు. ప్రతి ప్రాంతంలో పారిశుద్ధ్య చర్యలు మెరుగుపరచాలని, రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, ఈఈ ప్రసాద్, డీఈలు, ఏఈలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని క్రీడామైదానం

విజయనగరం జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడామైదానం అభివృద్ధికి నోచుకోవడం లేదు. క్రీడాకారుల ప్రాక్టీస్, స్థానికుల వాకింగ్, జాగింగ్‌లకు ఎంతగానో ఉపయోగపడే ఈ మైదానం నిర్లక్ష్యానికి గురవుతోంది. గ్రౌండ్‌లో ఎక్కడ చూసినా శిథిలమైన నిర్మాణాలు, పెచ్చులూడిన పిల్లర్లు, పిచ్చిమొక్కలే కనిపిస్తున్నాయి. దీనికితోడు మైదానం సహా మైదానం పరిసర ప్రాంతాలు మందుబాబులకు అడ్డాగా మారింది. ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్న మద్యంసీసాలు, సిగరెట్ ప్యాకెట్లే దీనికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి.
–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



కనీసం సున్నం కూడా వేయని మెట్లు ట్రాక్



శిథిలమైన పిల్లర్లు



అపరిశుభ్రంగా క్రీడాకారులు కూర్చొనే ప్రాంతం







మైదానం పరిసరాల్లో మందుబాబులు వాడి పడేసిన మద్యంసీసాలు



పిచ్చిమొక్కలతో వ్యాయామ స్థలం

ఇదేం 'చెత్త' పని..



నగరంలోని పద్మావతినగర్ శివారులోని వసంత్‌విహార్‌లో చెత్త నిల్వ ప్రాంతంలో ఇష్టానుసారంగా చెత్తను కాల్చివేస్తున్నారు. దీంతో ఆ పరిసర ప్రాంతాల ప్రజలు పొగ, గాలి కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ చెత్త నిల్వకు కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం డస్ట్‌బిన్ ఏర్పాటు చేసినప్పటికీ అందులో చెత్త వేయకుండా ఆ పక్కన వేసి దానికి నిప్పు పెడుతున్నారు. ఇది చూసిన వారంతా ఇదేం పని..ఇలాగేనా చెత్తతో సంపద సృష్టించేది అని కూటమి ప్రభుత్వాన్ని బాధిత ప్రాంత ప్రజలు, స్థానికులు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెత్త నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – విజయనగరం

రోడ్డుపైనే మురుగు..



కార్పొరేషన్ పరిధిలోని పూల్‌బాగ్ ప్రధాన రోడ్డులో కొన్నిరోజులుగా మురుగునీరు నిలిచిపోయి ఉంది. నిత్యం ప్రయాణికుల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఇలాంటి దుస్థితి ఉన్నా అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు. గత కొన్నాళ్లుగా మురుగునీరు అలానే ఉండిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆ దారిన వెళ్లే వారంతా ముక్కు మూసుకుని మరీ వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు చొరవ తీసుకుని, మురుగు తొలగింపు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – విజయనగరం

4న ధర్నా



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్: కలెక్టరేట్ వద్ద ఈ నెల 4వ తేదీన ఆటోడ్రైవర్లు ధర్నా చేయనున్నట్లు శ్రీవిజయదుర్గా ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నీలాపు అప్పలరాజురెడ్డి, రెడ్డి నారాయణరావులు తెలిపారు. ఇదే విషయమై వారు నగరంలోని ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ధర్నా కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్ గురువారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో వాహనమిత్ర పథకం కింద డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కొల్లు రవీంద్ర.. రూ.10 వేలు వేస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. ప్రతి డ్రైవర్‌కూ ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు ప్రకటించాలని, ఇ–చలాన్లు, సెక్షన్ 336 కేసుల నుంచి ఆటో కార్మికులకు పూర్తిగా మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చెన్నా ధర్మ, బాలి సన్యాసిరావు, కంది రాము, తర్లాడ శ్రీధర్, గేదెల నారాయణరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

విజయనగరం: పారిశుద్ధ్య కార్మికుల ఖాళీలు భర్తీ చేసి పని భారం తగ్గించాలని, విశ్రాంతి పొందిన, మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లోని యువతకు కార్పొరేషన్‌లో ఉపాధి చూపాలని, పండగ, ప్రభుత్వ సెలవులు వర్తింపజేయాలని, కార్మికులకు అవసరమైన సేఫ్టీ పరికరాలు అందజేయాలంటూ పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు గురువారం ధర్నా చేశారు. తమ డిమాండ్లను యూనియన్ నాయకులు ఎస్.రంగరాజు, జె.కామేష్ వినిపించారు. విశ్రాంతి పొందిన అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఎలాంటి ఆర్థిక సదుపాయాలు కల్పించకపోవడంపై ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పర్మినెంట్ కార్మికులకు రావాల్సిన సరెండర్ లీవు బకాయిలు రెండేళ్లు మాత్రమే పెండింగ్‌లో ఉంటే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 4 సంవత్సరాల సరెండర్‌లీవ్‌లు పెండింగ్‌లో ఉంచడం అన్యాయమన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్యకు అందజేశారు.

గిరిసీమల్లో కార్డెన్ సెర్చ్

శృంగవరపుకోట: తూరుపు తెల్లారక ముందే ఎస్.కోటలో పోలీసు బలగాలు గురువారం ప్రత్యక్షమయ్యాయి. అటు జిందాల్ వ్యతిరేక నిరసనలు.. ఇటు ఎస్.కోటలో ఆక్రమణల తొలగింపులున్న నేపథ్యంలో పోలీసుల రాకతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కొద్దిసేపటికి పోలీసులు కార్డెన్ సెర్చ్‌కు వచ్చినట్లు తెలిసింది. డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్.కోట, కొత్తవలస, విజయనగరం రూరల్ సీఐలు నారాయణమూర్తి, షణ్ముఖరావు, బి.లక్ష్మణరావు, 16 మంది ఎస్సైలు, 85 మంది పోలీస్ కానిస్టేబుళ్లు గిరిజన గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. ఇటీవల పల్లపుదుంగాడలో ఒక వ్యక్తి తన పినతండ్రిని నాటుతుపాకితో హత్య చేసిన నేపథ్యంతో ఇంటింటినీ జల్లెడ పట్టి నాటు తుపాకులు, ఆయుధాలపై ఆరా తీశారు. దారపర్తి పంచాయతీ పరిధిలోని మున్నపురాయి, రాయపాలెం, చప్పవాని గెడ్డ, పల్లపుదుంగాడ, రంగవలస, పాత శనగపాడు, కొత్త శనగపాడు, దబ్బగుంట.. మూలబొడ్డవర పంచాయతీ పరిధిలో లక్ష్మీపురం, బొడ్డపాడు, చిలకపాడు, చిట్టెంపాడు, గూనపాడు, తదితర గ్రామాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసిన పోలీస్ అధికారులు అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నా.. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. సెర్చ్ ఆపరేషన్‌లో విజయనగరం వన్‌టౌన్, టూటౌన్, రూరల్, తెర్లాం, పూసపాటిరేగ, సంతకవిటి, వల్లంపూడి, బొండపల్లి స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.